కథ నిలయం
5949
శ్రీకాకుళం

# కామేశ్వరి కాలేజి చదువు

సాయంత్రం కాలేజీనుంచి వచ్చాక స్నానంచేసి మేడపై అంతసు పిట్టగోడ ప్రక్కన కుర్చీలో కూర్చున్నాను. ఇలస్ట్రేటెడ్ వీక్లీలో బొమ్మలు చూస్తూ, సాయంకాలపు ఎండ అందంగా రోడ్డుపైన, ఇళ్ళ పెంకులపైన పడుతోంది. దూరంగా సముద్రంనుంచి వచ్చే చల్లగాలి శరీరానికి చక్కిలిగింతలు పెడుతూంది. ప్రక్కన తహశీల్దారుగారి మేడలోని రేడియోలోంచి సన్నాయి మేళం శంకరాభరణం రాగంలో వినవస్తోంది. ఆ మేళానికి తాళంవేస్తూ, పరవశత్వం పొందే కోర్కె, ఆలోచన — నాకు లేవు. ఎంత విసుక్కున్నా ఆ తహశీల్దారుగారు రేడియో గొంతును నొక్కరు. వార్ధక్యం ప్రవేశిస్తూన్నా మనుష్యుల్లో — అభిరుచులు వింత ధృక్పథంలో అభివృద్ధి చెందుతాయి. మేళానికి చెవులు అప్పగిస్తారు. వీధిలో సన్నాయిమేళం వాయిస్తూ వుంటే ఆఫీసుకు గంటన్నర లేటుగా వెళతారు.

ఇక ఆ మోతను భరించలేక — బజారుకెళ్ళి సీతా కోక చిలకల్ని చూడవచ్చుననే ఉద్దేశ్యంతో, కుర్చీలోంచి లేచేప్పటికి — మా కామేశ్వరి అక్కడకు ప్రత్యక్షమైంది దిగివచ్చిన దేవకన్యలాగ.

ఆమె మామయ్య కూతురు. కాలేజీలో బి. ఏ. ఫైనల్ చదువుతూంది.

స్నానంచేసి బాగా టాయిలెట్ అయింది. మట్టిరంగు షిఫాన్ చీరపైన పాలమీగడలాంటి తెల్లటి పట్టు జాకెట్ ధరించింది. రెండుజడల మధ్య రెండు మందార పువ్వుల్ని విలాసంగా పెట్టింది. మెడలో రాళ్ళ నెక్‌లెస్, ఎడంచేతికి రాళ్ళవాచ్, కుడిచేతిలో రెండు రాళ్ళ గాజులు, వ్రేళ్ళకు రాళ్ళవుంగరాలు! ఆమె హోదాకు నిలువుటద్దాలు! నన్ను పరవశుణ్ణిగా చేసే కొన్ని ప్రత్యేకతలు మా కామేశ్వరిలో ఉన్నాయి. ఆమె నడకలో హెడీలామర్ టీపీ, ఆమె నవ్వులో ఈస్తర్ విలియమ్స్ ఛాయలూ, ఆమె చూపులో రీటా హేవర్త్ పోలికలూ ఆమె ఒయ్యారంలో మార్లిన్ మన్రో ఒంపులూ — ఉన్నాయి. వాళ్ళంతా మా కామేశ్వరి ఫేవ రేట్సు. కాని చిత్రమేమిటంటే — రూపంలోనూ, లావణ్యంలోనూ, సౌందర్యంలోనూ, ఉత్సాహంలోనూ ఆమె మిన్నయైన, ఎందుకో ఆమె చేష్టలు నాలో కోపాన్ని, రగిలిస్తాయి, అసహ్యాన్ని రేకెత్తిస్తాయి. అందుచేతనే నేనంటే ఆమెకు సరిపడని సమయాలూ, ఆమె అంటే నాకు సరిపడని సమయాలూ అనేకం ఉన్నాయి.

ఆ రోజు సాయంత్రం నాజూగ్గా చేతులు వెనక్కు పెట్టుకుని పిట్టగోడ అంచున అటూ యిటూ రెండుసార్లు తాపీగా పచార్లుచేసి — నాకుర్చీ దగ్గరకొచ్చి నిలబడింది. కామేశ్వరి, కనుకొసల్నుంచి అదోరకంగా చూస్తూ.

నాతో యేదో విషయాన్ని గురించి మాట్లాడే ఉద్దేశ్యంతో ఆమె ఉన్నదని నేను సులభంగా గ్రహించాను. వీక్లీలో బొమ్మలు చూడడంమానివేసి ఆమె ముఖంలోమారే బొమ్మలకేసి చూడసాగాను. ఇరవై సంవత్సరాల నవయువ్వని సుందరాకారుడ్ని — అట్లా ఏ జవ్వని వంకైనా చూస్తే ఆ జవ్వని సిగ్గుతో మల్లెమొగ్గ కాదూ! కాని మా కామేశ్వరి కాలేదని చెప్పటానికి చిన్నతనమేస్తోంది. సరిగదా మెత్తగానైనా చిరునవ్వే నవ్వలేదు. నా దగ్గర దానికి సిగ్గేమిటి? అంతేనా? సిగ్గు స్త్రీకి సహజాలంకారం కాదూ! అందులో వయస్సు వస్తూన్నవాళ్ళకు—బంగారానికి పూత పూసినట్టు కాదూ!

'ఎందుకొచ్చావు?' అన్నాడు సీరియస్ ముఖంబెట్టి ఆమెకేసి చూశాడు.

ఆమె పెదాలు విచ్చుకున్నాయి—చంద్రకాంతి కలువ రేకులు విచ్చుకున్నట్టు.

"మిమ్మల్ని ఒక సలహా అడుగుదా మనుకుంటున్నాను."

"అడుగు. అందుకు అభ్యంతరమేముంది?" అన్నాను వెంటనే.

సంవత్సరంగా ఆమె యింట్లో వుంటూ ఆమె యింట్లో దివ్యంగా భోజనంచేస్తూ, కాలేజీలో చదువుకుంటూన్న నేను' ఎప్పుడూ యెట్టి పరిస్థితుల్లోనూ, ఆమె మనస్సుకు ఏ విధమైన బాధనూ కలిగించి యుండలేదు. ఆమె వినోదాలను విమర్శించి యుండలేదు. ఆమె విలాసాలను హేళనచేసి యుండలేదు. ఆమె హోదాను అవమానపర్చి యుండలేదు.

"స్టూడెంట్స్ యూనియన్ యెన్నికలు వస్తున్నాయి కదూ! ఈ సంవత్సరం ప్రసిడెంటుషిప్‌కు ఒకగర్ల్ క్యాండిడేట్‌ను నిలబెట్టాలని మా గరల్సంతా అనుకున్నాం. మీ అభిప్రాయమేమిటి!"

నాకు గొంతులో అముదంకారినట్లయింది. స్టూడెంట్స యూనియన్ యెన్నికలకు గర్ల్ నిలబడడమా? అందులో పదిహేను వందల మంది మగపిల్లలుగల కాలేజీలో! నాకు ఆశ్చర్యం వేసింది. ఆ గరల్సంతా అటువంటి నిశ్చితాభిప్రాయానికి రావడంలోని ఆంతర్య మేమిటో! గరల్ క్యాండిడేట్ ఒకవేళ యే ప్రసిడెంటుగానో సెక్రటరిగానో ఎన్నికైతే — ప్రస్తుతం మగపిల్లలు విరివిగా ఉంటే కాలేజీలో ఆడపిల్లలు మానసికంగా పడే బాధలు నివారణ అవుతాయనా? మగపిల్లలు ఉషారుకొద్దీ, మదంకొద్దీ, గ్రేస్‌కొద్దీ చేసే అల్లరులు అరికట్ట బడతాయనా? అటువంటిది జరిగితే మంచిదేగా?

"ఏమిటి ఆలోచిస్తున్నారు" అన్నది కామేశ్వరి సమాధానం చెప్పడం మరచి, ఆలోచనలో పడ్డ నన్ను చూసి.

"ఆ ఏం లేదు! గెలిచేట్టుగా ఉంటే నిలబెట్టవచ్చు"

నామెట్ట వేదాంతం ఆమెకు రుచించలేదు. ముఖాన్ని సీరి యస్‌గా మార్చింది.

"ఏం ఒక స్త్రీ పోటీ చేసి గెలవలేదా!" అన్నది ధీమాగా. ఇప్పటికి మగవాళ్లు అనుకొంటూన్నంత అబలలూ, అసమర్థులూ, అశక్తులూ స్త్రీలు కారు. వాళ్ళలోనూ పరి పాలనా దక్షతా, కాలచక్రాన్ని తిప్పే సామర్థ్యమూ, మంచీ — చెడూను విమర్శించే విచక్షణా జ్ఞానమూ ఉన్నాయి. అనే భావం ఆమె మాటల్లో తరుచూ గోచరిస్తూ వుంటుంది. అందుచేత ఆడవాళ్ళను గురించి మాట్లాడే విషయంలో ఆమె దగ్గర జాగ్రత్తగా వుండటం మంచిది. లేకుంటే వయస్సులో ఉన్న ఆడపులిలాగాగ మీాద పడుతుంది.

"గెలవచ్చు. కాని సులభంకాదు. మగవాళ్ళ వోట్లని కూడా చాలా సేకరించ వలసి వుంటుంది." అన్నాను.

"అందుకు మేము పథకాలను తయారుచేసి అట్టే పెట్టు కున్నాం:"

"మంచిది. అయితే యింతకూ నిలబడే అమ్మాయి ఎవరు?"

"మీాతో మాట్లాడుతూన్న అమ్మాయ్!"

"ఆ!"

"ఏం గాభరా పడ్డారు! నేను నిలబడరాదా?" నిలబడి గెలవలేనా?"

ఏం సమాధానం చెప్పేది? లక్షాధికారి కూతురూ, ల్యాండ్‌మాస్టరు కారులో రోజూ కాలేజీకివచ్చే అమ్మాయీ,

ఎన్నికల్లో నిలబడి, తారతమ్యం లేకుండా ప్రతి విద్యార్థినీ వోటు అడిగి — వాళ్ళు వేసే కొంటె ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకుంటూ. గెలవడమా! ఏదో అందమైన అమ్మాయీ. లక్షాధికారి కూతురూ, వోటు అడిగిందని తాత్కాలికంగా 'సరే'నని, మీకుతప్ప మరొకళ్ళకు ఓటు యిస్తామా? కల్ల అనీ 'మా ఓట్లన్నీ మీకే' అనీ అంటారుగానీ, తీరా ఆ సమయం వచ్చేప్పటికి, అట్లా అన్న విద్యార్థులంతా 'ఛీ, వెధవది. ఇంత బ్రతుకూ బ్రతికి ఆడదానికి ఓటు ఇవ్వడమా? మనం అంత క్రిందికి దిగజారామా?' అని అనుకోరూ? అయినా ఆమెకు అంతకీర్తి దాహం దేనికి? హిమాలయా పర్వతంలాగ తరగని ఆస్తి సకల సౌఖ్యాలు ఉన్నప్పుడు, హాయిగా కాలక్షేపంగా చదువుకోక ఎన్నికల గొడవెందుకు? గెలిచినా ఓడినా అది విద్యార్థులకే తగిందికానీ — అటువంటి విషయాల్లో విద్యార్థినులు జోక్యం కలిగించుకోవటం శ్రేయస్కరంకాదు.

"ఇటువంటి విషయాల్లో నీలాంటి అమ్మాయి తల దూర్చడం బాగుండదు. నువ్వు సామాన్య కుటుంబీకురాలివి కావు. నీకు సంఘంలో ప్రత్యేకస్థానమూ, గౌరవమూ ఉంది. ఇటువంటి లేనిపోని పరువు ప్రతిష్ఠలకు పోయి ఆహోదాకు మచ్చని కొని తెచ్చుకోవడం సమంజసంకాదు" అన్నాను ఖచ్చితంగా.

"నాకు నిలబడాలనే వుంది. గెలుస్తానని నాకు బాగా ఆత్మ విశ్వాసం ఉంది. ఇందువల్ల నేను కుటుంబానికి న్యూనతను తెచ్చేది యేమీ ఉండదు. స్టూడెంట్స్ యూనియన్‌కు

అధికారులుగా మగవాళ్ళుండి — అమ్మాయిల కష్ట నష్టాలను కించిత్తుగూడా ఆలోచించడంలేదు. అందుచేతనే మేమంతా ఒకడిసెషన్‌కు వచ్చాము"

ఆ పైన యిక నేను మాట్లాడలేదు. అందువల్ల యేం లాభం ఉండదు. ఆమె పట్టిన, పట్టే పట్టు కంటికిరెప్పగా, పూవుకు తావిగా పెరిగిన పిల్లగనుక ఆమెకు గారాబమూ, గర్వమూ అతి సహజంగానే అలవడ్డాయి.

"మీరు ఒక్క సహాయం చేయాలి?"

"ఏమిటి?"

"మీ క్లాసులో నాగురించి మీరు కాన్వాస్ చేయాలి. ఈ నవనాగరిక ప్రపంచంలో, పురుషునితో పాటు స్త్రీకి కూడా సమాన హక్కులు ఉండాలనే ఈ కాలంలో — స్టూడెంట్సు యూనియన్‌లో స్త్రీకి స్థానం యివ్వలేరా? అంత మాత్రం త్యాగం చేయలేరా విద్యార్థులు?" కామేశ్వరి గొంతు ఉపన్యాసధోరణిలో పడ్డది.

"సరే! నా మాటవినే వాళ్ళందరితోనూ చెబుతాను" అని తాత్కాలికంగా ఆమెనుంచి తప్పించు కున్నాను.

కాని కామేశ్వరి ప్రెసిడెంటు షిప్‌కు నిలబడడం నాకు బొత్తిగా యిష్టంలేదు. ఆమెకు ఆ ఆలోచన, అభిలాష ఎట్లా కలిగాయో గాని ఒకవేళ ఖర్మం జాలక ఎన్నికల్లో నెగ్గటమే కనుక తటస్థపడితే ముందు ముందు ఆమె యెదుర్కోవల్సిన చిక్కులు. సమస్యలు ఎన్నో ఉంటాయి. ఆ విషయం తెలియకనే, సంప్రదించకుండానే — ఆమె ఉబలాట పడుతున్నదా?

స్టూడెంటు యూనియన్స్ కాలేజీల్లో స్థాపించబడ్డ ఉద్దేశ్యం ఉత్కృష్టమైనదైనా ఆ యూనియన్స్ వలన విద్యార్థులకు, విద్యార్థినులకు జరగ వలసిన ఉపకారం యెంతో ఉన్నా — ప్రస్తుతం ఆ యూనియన్స్‌కు యెన్నికైన చాలా మంది తమ విధ్యుక్త ధర్మాన్ని మర్చిపోతూ, తమవల్ల స్టూడెంట్సుకు జరగవలసిన ప్రయోజనాన్ని త్రోసి రాజంటూ, ఆ ఎన్నికనే ఎమ్. ఎల్. ఏ. ఎన్నికగానూ, పార్లమెంటు మెంబరు ఎన్నికగానూ యెంచుకుంటూ డబ్బును విరివిగా ఖర్చుపెడుతూ, ప్రచారం బ్రహ్మాండం చేస్తూ, ఎమ్. ఎల్. ఏ, ఎం. పి. ఎలక్షనల్లో కొందరు అవలంబించే విధానాల మాదిరిగా నిర్బంధాలూ, కొట్లాటలూ, తిట్టుకోవటాలు, ద్వేషాలు పెంచుకోవటాలూ — మొదలైనవి చేస్తూ చాల అసహ్యంగా, అసభ్యంగా, అమానుషంగా ప్రవర్తిస్తున్నారు, తాము అభ్యసించేది కళాశాలవిద్య. విజ్ఞానం, విచక్షణాజ్ఞానం తమలో జీర్ణించుకొని ఉండాలి, విద్యార్థి దశలో జీవితాన్ని ఆదర్శంగా గడిపి — భావిలో పైకి పోవాల్సిన బాధ్యత తమపై యెంతైనా ఉంది, — అని తెలిసికోలేని కొంతమంది విద్యార్థులు, కాలేజీ జీవితాన్ని అపార్థంచేసికొని, వింతకోణాన్నుంచి చూస్తూ, — ఆ జీవితం తాలూకు జల్సాను, స్వేచ్ఛను గొప్ప అనుభవాలుగా భావిలో గుర్తుంచుకోవాలని ఉబలాట పడే విద్యార్థులు, కీర్తి కోసం చదువునూ, ధనాన్ని లక్ష్యపెట్టని విద్యార్థులు—కులం, జాతి, హెచ్చు, తగ్గులు మొదలైన విభేదాలను యూనియన్ ఎన్నికల్లో తీసికొనివస్తూ ముఖ్యోద్దేశ్యానికే ముప్పు తెస్తున్నారు. అటువంటి పరిస్థితుల్లో

—నా స్వార్థపు మమత కానీయండి, అభిమానపు విలువ కానీయండి, భావాల ఇరుకుదనం కానీయండి మా కామేశ్వరి సాహసించి ఒక అసాధారణమైన కార్య భారానికి పూనుకోవడం నాకు ఇష్టంలేదు. ఆ అమ్మాయి స్టూడెంట్సు యూనియన్‌లో ఉన్నత పదవిని స్వీకరించడం మగపిల్లల కాలేజీల్లో నాకు తెలిసినంత వరకూ ఎక్కడా జరిగి యుండలేదు. అయినా నాకు నేరుగా ఇష్టంలేదని చెప్పుకోవల్సిందే గాని— ఆమెను నచ్చ జెప్పే సామర్థ్యం, చాకచక్యం, చొరవ నాలో లేవు. చాలా విషయాల్లో ఆమె నన్ను తక్కువగా చూడడం కూడా నేను గ్రహించి ఉన్నాను.

మా కాలేజీలో దాదాపు రెండు వందలమంది విద్యార్థినిలు ఉన్నారు. అందులో ఫోర్తుయియర్ క్లాసులో దాదాపు ముప్పై ఆరుమంది ఉన్నారు. బి. ఎ. ఎకనామిక్సులో ఎనిమిది మందీ, బి. ఎ. మ్యాథమాటిక్సులో ముగ్గురూ, బి. యస్. సి. మాథ్స్‌లో అయిదుగురూ, బోటనీలో పన్నెండు మందీ, జ్యాయాలజీలో ఎనిమిదిమందీ ఉన్నారు. మా కామేశ్వరి చెప్పిన ప్రకారం ఎలక్షన్ పథకాలేమిటంటే— తన క్లాసులోని ఆనందలక్ష్మి అన్నయ్య బి. యస్. సి. (ఫిజిక్సు) బి. యస్. సి. మ్యాథ్సులోని శివకామేశ్వరీ తమ్ముడు బి. ఎ. (ఎకనామిక్సు) బి. యస్. సి. బోటనీలోని రాజేశ్వరి భర్త, బి. యస్. సి. (కెమిస్ట్రీ) కృష్ణకుమారి అన్నయ్య బి. ఎ. (మ్యాథమాటిక్సు) జ్యాయాలజీలోని విమలా సుందరి తమ్ముడు బి. కామ్, ఉషా దేవి ప్రియుడు బి. యస్. సి. (బోటనీ) చదువుతున్నారు. ఆ

అమ్మాయిలంతా తమ అన్నలనూ, తమ్ముళ్లనూ, భర్తలనూ, ప్రియులనూ— కామేశ్వరికి ఓట్లు యిచ్చేట్లు చేయడమే కాకుండా, ఆమె తరపున నిష్కల్మషంగా, నిస్సిగ్గుగా, నిర్మొమాటంగా ప్రచారం చేసేందుకు కూడా మాట ఇచ్చారు. నేను చదివే బి. కామ్. క్లాసులో ఉన్న అరవై తొమ్మిది వోట్లలోనూ కనీసం నలభై ఓట్లను కామేశ్వరికి వేయించే బాధ్యతను నామీద వేశా . మాటవరుసకు 'సరే' అన్నాను.

ఆ పథకాల్లో మరో ముఖ్యవిశేష మేమిటంటే విశ్వంభరరావులాంటివాడు బలపర్చడం. అది కామేశ్వరి ఆంబదానికి అంతులేకపోయింది. ఆమె గెలిచినట్లే గంతులు వేయసాగింది.

మా కాలేజీ ఎన్నిక పద్ధతి ఏమిటంటే: స్టూడెంట్సు యూనియన్ ప్రెసిడెంటును ఫోర్తు యియర్ స్టూడెంట్సు, వైస్ ప్రెసిడెంటును సెకండు యియర్ స్టూడెండ్సు, సెక్రటరీని థర్డ్ యియర్ స్టూడెంట్సూ, జాయింట్ శెక్రటరీని ఫస్టు ఇయర్ స్టూడెంట్సూ ఎన్నుకోవాలి. ఫోర్తు ఇయర్ విద్యార్థులు మొత్తం నాలుగు వందల పదహారు మంది.

ప్రసిడెంటుకు మొత్తం ముగ్గురు పోటీ చేస్తున్నారు. అందులో క్రితం సంవత్సరం నాగభూషణరావు ఒకడు. మరొకతను విజయ శంకరరావు.

ఎన్నికల ప్రచారాలు— నామినేషను పత్రాలు పరిశీలించగానే మొదలు పెట్టబడ్డాయి. ఆ వారం పదిరోజులూ కాలేజీ వాతావరణమే మారుతుంది. ఎక్కడ జూచినా విద్యార్థులే. ప్రాథేయ పడటాలు, తలలు ఆడించటం, నానుడులో

పెట్టడం, చిరునవ్వులు, ఈసడింపులు, ఆశ చూపెట్టడం—ఇలాంటి వాటితో విద్యార్థిలోకం కళకళలాడుతూ వుంటుంది. నాగభూషణరావు పదిహేనుమంది విద్యార్థుల్ని వెంటవేసుకొని రాత్రుళ్లు విద్యార్థుల రూములకెళ్ళి తనకు ఓటు నివ్వమని అడగనారంభించాడు. జయశంకరరావుకూడా అట్లానే ప్రచారంచేయ నారంభించాడు.

ఆ సాయంత్రమే విశ్వంభరరావు కామేశ్వరీ ప్యామ్‌ప్లెట్లు అచ్చువేయించు కొచ్చాడు. అవి దంతపు కాగితపు ముక్కలమీద సువర్ణాక్షరాలతో సుందరాతి సుందరంగా అచ్చు వేయించబడ్డాయి. అవి చూసుకొని మా కామేశ్వరి ఒకటే మురిసిపోవటం! తనస్నేహితురాళ్ళందరికి పంచిపెట్టింది. ఒక నాలుగు వందల కార్డులు విశ్వంభరరావు తీసికున్నాడు పంచి పెట్టేందుకు. ఒకవంద కార్డులు నాపాలిటబడ్డాయి. మా క్లాసులో పంచిపెట్టేందుకు. నిజం చెప్పొద్దూ నాకు ఎంతో కష్టం వేసింది. ఎందుకో నాకు అట్లా పంచి పెట్టటం తగని నామోషి అయింది.

ఆ ఉదయం విశ్వంభరరావు, దయానందశర్మా, మరి ఇద్దరు విద్యార్థులూ మామేడకి వచ్చారు కామేశ్వరితో మాటాడేందుకు. ఆమె వారందరికీ ఇడ్లీ, ఉప్మాలు పెట్టి, కాఫీ యిచ్చి— మర్యాద చేసింది. నేను మేడ మీదనుంచి దిగి రాలేదు, వాళ్ళ ప్రచారానికి బయలుదేరారుట. నన్నుకూడా వెళ్ళమని మా కామేశ్వరి బలవంతం చేసింది కాని ససేమిరా వెళ్ళలేదు.

విశ్వంభరరావు ముఠావాళ్లు మా కామేశ్వరి తరఫున ప్రచారం చేయనారభించారు.

గాలిలో గడ్డిపోచలు లేచినట్లు విశ్వంభరరావు అంతటి వాడు కామేశ్వరి పక్కన ప్రచారం చేయడంతో గిట్లనివాళ్లు అనేకవిధములైన పుకార్లు లేవదీసినారు గాని వాటిని ఉభయులూ లక్ష్యపెట్టలేదు.

ఎన్నికతేదీ దగ్గర పడినకొద్దీ కామేశ్వరిలో ఒకవిధమైన భయమూ, ఉత్సాహమూ, ఆదుర్దాకూడా అధికం కాసాగినయ్.

గెలవచ్చుననే ఉత్సాహం కొంతసేపు, ఓడిపోతామేమో నన్న భయం మరికొంతసేపు, ఫలితం ఎట్లా పరిణమించునోనన్న ఆదుర్దా యింకొంతసేపు— మొత్తానికి ఆమె వేళకు తిండికూడా తినుటలేదు. గచ్చకాయ రంగు కారులో స్నేహితురాండ్ర యిళ్ళకు ఒకటే తిరగటం!

ఏమైనా ఎన్నికలలో నాగభూషణరావే గెలవవచ్చుననే వినికిడి బాగా ప్రాకటంచేత, ఆగాలి కబుర్నే మా కామేశ్వరికి అందించాను. ఆమె నామీద సుడిగాలికి ఎండిన తాటాకు లేచినట్టు లేచింది. కాని ఏమాత్రం అధైర్య పడలేదు. ఆమె విశ్వంబరరావు మీద సంపూర్ణమైన విశ్వాసాన్ని కుదుర్చుకుంది. అందుకు కారణం— ఆమె హృదయంలో సంవత్సరంగా విశ్వంభరరావు మూర్తి చిత్రించబడటం కావచ్చు.

ఆ సోమవారం ఉదయం ప్రెసిడెంటుకు ఎన్నికలు డిగ్రీ

క్లాసుల్లో జరిగాయి. అయినప్పటికీ తాము ఖచ్చితంగా గెలుస్తా మనే నమ్మకం ఎవ్వరికీ లేకపోయింది.

కాని నేను మటుకు కామేశ్వరికి వోటు వేయలేదు. ఆ సంగతి ఆశ్చర్యాన్ని కల్గించవచ్చు. నమ్మకద్రోహం చేశా నని కూడా అనవచ్చు. పై పెచ్చు, మా క్లాసులో కూడా 'కామేశ్వరికి మీరు వోటు ఇవ్వండి. స్టూడెంట్సు యూనియ న్‌లో ఒక విద్యార్థినికి స్థానాన్ని ఇవ్వడం మనధర్మం.' అని నేను ఎవ్వరితోనూ చెప్పలేదు. నాతో స్నేహంగా వుండీ, సినిమా లకు షికార్లకు నాతో సమంగా తిరిగే, నా ఆంతరంగిక మిత్రుడు కాంతారావు 'వోటు మీ కామేశ్వరికి వేయమం టారా!' అని అన్నప్పుడు 'వద్దు. నాగభూషణరావుకు ఇవ్వు.' అన్నాను. ఎందుచేతనంటే నాకు మా కామేశ్వరి గెలవడం ఇష్టంలేదు. ఆపిల్ల తెలియక గెలవాలని ఉబలాట పడుతోంది గానీ తరవాత వచ్చే కష్ట నష్టాన్ని ఆలోచించిందా? నేను ఆమెకు ఓటు వేయలేదన్న విషయమూ, చాటుగా ఓటు వేయ వద్దని చేసిన ప్రచారమూ ఆమెకు తెలియనివ్వకుండా చేశాను.

ఆ సాయంత్రమే స్టూడెంట్సు యూనియన్ ఫలితాలు చెప్పారు.

నేను చాలా నిరాశ చెందాను.

నా హృదయం బాధతో మూలిగింది.

నా మనస్సు కన్నీళ్లు కార్చింది.

నేను అనుకొన్నట్టు జరుగలేదు. పదహారు వోట్ల మెజారిటీతో మా కామేశ్వరి స్టూడెంట్సు యూనియన్ అధ్యక్షురాలైంది. కాలేజీ స్టూడెంట్సు యూనియన్‌లో మొట్టమొదటి అధ్యక్షురాలైన ఖ్యాతి ఆమెకే దక్కింది. ఆరోజు వాళ్ళ ముఖాలన్నీ విప్పుకున్న పువ్వులాగుంటే, ఇక నాముఖంసంగతి వర్ణించ నక్కరలేదు.

ఆ మరునాడు సాయంత్రం మా కామేశ్వరి తన భవనంలో విశ్వంబరరావు, దయానందశర్మా, నీలకంఠేశ్వర రావూ, సీతారామమూర్తి మొదలైన కిరీటంలేని చక్రవర్తులకు హృదయపూర్వకంగా అభినందన వాక్యాలుపల్కి గ్రాండ్‌గా టీ పార్టీ యిచ్చింది. టీ పార్టీకి చాలామంది గరల్స్ ఆహ్వానింప బడ్డారు.

స్టూడెంట్సు యూనియన్ ఎన్నికలు జరిగిన పన్నెండు రోజులకు ప్రథమంగా మరొక ప్రసిద్ధ కాలేజీ ప్రిన్సిపాల్ అధ్యక్షత క్రింద మీటింగు ఏర్పాటు చేయబడింది. మీటింగుకు చాలామంది విద్యార్థులు, దాదాపు విద్యార్థినిలు అందరూ, లెక్చరర్లు హాజరయ్యారు.

ముందుగా కాలేజీ గానకోకిలలని ప్రసిద్ధి గాంచిన శివరంజనీ, లక్ష్మీ, సీతా, నాగమల్లేశ్వరీ, వెంకట సుబ్బమ్మ కలిసి 'వందేమాతరమ్' గీతం గానంచేశారు. నిజం చెప్పొద్దూ — ఆ అయిదుగురూ గానం చేస్తూంటే అయిదు కాకులు ఒకగోడ మీద కూర్చుని చచ్చిన కాకికోసం యేడుస్తున్నట్టుగానూ,

చెప్పులు తెగిన అయిదు ఆడకుక్కలు తమ బాధను సంగీతం ద్వారా వ్యక్తం చేసికుంటున్నట్టుగానూ అనిపించింది నాకు.

ఆతర్వాత మా కామేశ్వరిలేచి ఇంగ్లీషులో ఆమీటింగు ఏర్పరచిన ఉద్దేశ్యాన్ని ఆ వేదికను అలంకరించిన పెద్దమనుషుల పరిచయాన్ని సాధ్యమైనంత సంగ్రహంగా చెప్పింది. నాగభూషణరావు ముఠావాళ్లు అక్కసున్నకొద్దీ మా కామేశ్వరి మాట్లాడుతున్నప్పుడు గుర్రం సకిలించినట్టూ, గాడిద సకిలించినట్టూ కోతిచేష్టలు చేశారు గానీ ఆపిల్లమాత్రం తొణకలేదు. విశ్వంభరరావు వేదిక పక్కనే నిలబడ్డాడు. తరువాత స్టూడెంట్సు యూనియన్ సెక్రటరీగా ఎన్నికైన సంజీవరావు తనని పరిచయం చేసుకుంటూ రెండు ముక్కలు తడబడే ఇంగ్లీషులో మాట్లాడాడు.

ఆరోజు సభ మొత్తంమీద ప్రశాంతంగానే ముగిసింది.

ప్రెసిడెంటు పోటీ చేసి, ఒకఅమ్మాయిక్రింద ఓడిపోవాల్సి వచ్చిందనే చింత, అక్కసు, కోపమూ, అవజ్ఞా — నాగభూషణంలో బాగా పాతుకు పోయినాయి. అతని ముఠాలోవాళ్ళకు కూడా తలతీసివేసినట్టుగా ఉంది. కనుక వాళ్ళంతా కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. కామేశ్వరిని సక్రమంగా అధ్యక్షురాలి పదవిని నిర్వహించనీయకూడదు. పైపెచ్చు తన విరోధియైన విశ్వంభరరావు ఆమెను బలపర్చి ఆమెను ఎన్నికల్లో గెలిపించి, ఆమెతో ఎప్పుడూ తిరుగుతూ, టీ పార్టీలకు హాజరవుతూ — వాళ్ళ మీద తన పగ దీర్చుకోవాలి. సంవత్సరమంతా స్టూడెంట్సు యూనియన్ ఎట్లా నిర్వహిస్తారో

తను చూడాలి! అనే అభిప్రాయానికి నాగభూషణరావు నిశ్చయంగా వచ్చాడు.

నాగభూషణరావు ఆ బస్తీలో పేరుమోసిన ముఠాతో సంబంధం ఉంది. తరుచూ వాళ్ళతో తిరుగుతూ వుంటాడు. ఆ ముఠాక్రింద జరిగే అల్లరులూ, దొంగతనాలూ, మోసాలూ, మానభంగాలూ మొదలైనవాటిలో నాగభూషణరావు కూడా పాల్గొంటూ వుంటాడు. అందుచేత అతనంటే దడిచేవాళ్ళు కూడా చాలామంది వున్నారు.

ఒకరోజు సాయంత్రం మిత్రుడు కాంతారావు అన్నాడు నాతో క్లాసులో.

"గరల్స్ వెయిటింగ్ రూమ్ మీద ఏం వ్రాసేరో చూశావా?"

"ఏం వ్రాశారు?"

"ఆ బూతులే నానోటితో చెప్పించటం దేనికి? వెళ్ళి చూసిరా."

"ఎవరి మీద, ఏమని — అసలు ఎవరు వ్రాసారు?" అన్నాడు ఆదుర్దాగా.

"ఎవరిమీదో అయితే నేనెందుకు చెబుతాను? మీ కామేశ్వరిమీద!"

నా ప్రాణం గాలిలో తాటాకులాగ కొట్టుకుంది. గబగబా మెట్లుదిగి క్రిందికి వెళ్ళి చూశాడు. అరికాలిలో ఆరంభమైన క్రోధోద్రేకం తటాలున గోళ్ళ చివరలకు ప్రాకింది.

ముఖం ఎఱ్ఱబడింది. మా కామేశ్వరికి జరిగిన అన్యాయాన్ని సహించలేకపోయాను. ఎవరా దుర్మార్గులు? నీచులు! ఎంత అవినీతికి పాల్పడ్డారు? చదువుకొనే చదువు, భవిష్యత్తులో జీవితానికి చక్కని రాస్తా యేర్పరచుకొనేందుకు, విజ్ఞానాన్ని ఆర్జించేందుకు, మంచి అలవాట్లను అలవరుచుకొనేందుకు నిత్యమూ కాలేజీకి వస్తూ,—ఉన్నతవిద్య నార్జించే కొంతమంది విద్యార్థులే తమ అంతస్థును, తమ ధర్మాన్నీ, తమ కర్తవ్యాన్నీ మర్చి, ఆడపిల్లల వెయిటింగ్ రూమ్ మీద అసహ్యంగా బూతుమాటల్ని చిత్రించడం, ముందు విద్యార్థినులు నడిచి కాలేజీకి వెళుతూంటే వెనుకచేరి వ్యంగ్యంగా విమర్శించడం, వాళ్ళని రాచుకుపోవాలని వెఱ్ఱిగా ప్రయత్నించడం, వాళ్ళకేసి కళ్ళు వంకరబోయేటట్లు చూస్తూ వెకిలిగా నవ్వడం, క్రాపులూ, కాలరూ సర్దుకోవడం — మొదలైన తలవంపు కరములైన పనులు చేస్తూంటే, కాలేజీకి ఆడపిల్లలను పంపించేందుకు కొంతమంది తలితండ్రులలో భయాన్ని కలిగిస్తూంటే — కాలేజీలు ఎట్లా బాగుపడేది? ఈనాడు మగపిల్లల కాలేజీలకు తమ ఆడపిల్లల్ని పంపించేందుకు—ఎంతో మంది మానసికంగా బాధపడుతున్నారు. మగపిల్లలు చేసే గోలను, అల్లరులను, అవినీతికరములైన చేష్టలను, అసభ్య ప్రవర్తనలను కొంతమంది అధికారులు గుర్తించరు, చూసీ చూడనట్లు వ్యవహరిస్తారు. ఆ బాధకు గురిఅవుతూ చెరువులోని చాపల్లాగ కుమిలిపోయేది అమ్మాయిలే! ఒకసారి సెకండుయియర్ బై. పి. సి. క్లాసులో ఆడపిల్లల బెంచీ

2)

వెనుక కూర్చున్న మగపిల్లల బెంచీలోని ఒక కొంటెవిద్యార్థి — తన పాదముల మునిగోళ్ళతో ఒక అమ్మాయి మెత్తటి తెల్లటిపాదాన్ని గట్టిగా నొక్కగా, ఆ పిల్ల గండుచీమ కుట్టినట్లు చీరముడతల్లో తేలుపిల్ల జొరబడ్డట్లు, ఉలిక్కిపడి 'అబ్బా' అని మనస్సులో ఆవలించింది. మరోసారి ఫస్టు యియర్ హిస్టరీ క్లాసులో ఆడపిల్లల బెంచీవెనుక కూర్చున్న మగపిల్లల బెంచీలోని ఒకతుంటరి విద్యార్థి – ఒకఅమ్మాయి చెమటను చేతి రుమాలుతో మెడతుడుచుకుంటూ వుండగా, ఆ రుమాలును వెనుకనించి అవలీలగా లాక్కొని ఫక్కున యికిలించాడు. ఒకరోజు సాయంత్రం బి. యస్. సి. బోటనీ క్లాసులో, గదిలో సాయంత్రపు యెర్రని ఎండ పడుతూండగా ఒక విద్యార్థి తన వ్రేలి పచ్చఉంగరంతో ఎదురు బెంచీలో కూర్చున్న అమ్మాయిమీదకు ఫోకస్ వేసి, వాళ్ళ అందమైన ముఖంమీద రంగుల నీడలు పడుతూండగా గర్వించాడు ప్రతి కాలేజీలోనూ ఇట్లాంటి అపచారాలు అమ్మాయిలకు జరుగుతూనే ఉన్నాయి. 'చదువు' అనే వంకతో, 'విద్యార్థి' అనే ముసుగుతో కాలేజీకివచ్చే వాళ్ళల్లో అనేకరకాలైనవాళ్ళు వుంటారు. కేవలం భవిష్యత్తులో జీవనాధారంకోసం చదువును నేర్చుకొని ఉపయోగించుకుందామనే ఉద్దేశ్యంతో వచ్చేవాళ్ళు కొంతమంది, ఏదో సరదాకోసం, కాలక్షేపం కోసం, 'కాలేజీ జీవితం' అనే అనుభవాన్ని జీవితంలో గడించేందుకు వచ్చేవాళ్ళు కొంతమంది, ఇప్పుడు అయిదువేల రూపాయలు కాలేజీకి, బస్సీల్లో హోటల్సుకు, థియేటర్లకూ ధారపోస్తే – ఆ తరువాత యిరవై అయిదువేల రూపాయలను

'కట్నం' అనే గౌరవప్రదమైన వరంగా స్వీకరించవచ్చుననే అభిలాషతో కాలేజీకి వచ్చేవాళ్ళు కొంతమంది. మొదటి రకాన్ని మినహాయిస్తే మిగతా సరుకులో కాలేజీకి చెడ్డపేరు ఆర్జించేవాళ్లే ఎక్కువమంది మిగులుతారు.

అటువంటివాళ్ళను శిక్షించి, వాళ్ళు చేసే అసభ్యపు చేష్టల్ని అరికట్టవలసిన బాధ్యత విద్యాలయాధికారుల పైన ఎంతైనా ఉంది.

నాటి ఉప్పెనగా వచ్చిన కోపాన్ని తాత్కాలికంగా దిగమింగుకొని ఆ వెధవపనికి తలపడిన వాళ్ళనిగురించి ఆలోచించసాగాను. నాగభూషణరావు ముఠావాళ్ళన్న అనుమానం నాకుకలిగింది. ఆ సాయంత్రం మా కామేశ్వరితో సంప్రదించగా తన అనుమానంకూడా అదేననీ విశ్వంభరరావు తనతో అట్లానే చెప్పాడనిన్నీ చెప్పింది. పైగా ఆమె ప్రిన్సిపాల్ గారికి స్వయంగా రిపోర్టుయిచ్చిందట. ఆయనగారు ఆ రిపోర్టును పరిశీలించి తగుచర్యలు తీసికొనేందుకు త్వరలో ప్రయత్నిస్తానని చెప్పాడట.

ఒకరోజు సాయంత్రం అయిదుగంటలకు స్టూడెంట్సు యూనియన్ ఆధ్వర్యాన ఒకమీటింగు యేర్పాటు చేయబడినది. విదేశయాత్రచేసి వచ్చిన ఒక రిటైర్డు అయిన ప్రిన్సిపాల్ తన అనుభవాలను విద్యార్థులకు చెప్పేందుకుగాను ఆ మీటింగు యేర్పాటు చేయబడింది. అధ్యక్షుడు మా కాలేజీ ఇంగ్లీషు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు అయిన సన్యాసం సాంబశివ శాస్త్రిగారు ముందుగా మా కాలేజీలో ఆ రోజు మీటింగ్ యొక్క ఉద్దేశ్యాన్ని ప్రయోజనాన్ని, వ్యక్తిగత

పరిచయాన్ని చెప్పేందుకుప్రక్రమించగా స్టూడెంట్స్‌లో కొంత మంది గోలచేయ నారంభించారు. వాళ్ళు నాగభూషణరావు ముఠాలోనివాళ్లే. విశ్వంభరరావు యేమీచేయలేక చూస్తూ వూరుకున్నాడు. వైస్ ప్రిన్సిపాల్ వైద్యనాథ శాస్త్రిగారు అక్కడికి రావడంతో సద్దుమణిగింది. కాని మీటింగ్ అయినాక మా కామేశ్వరి ఇంటికి వెళ్లేందుకు కారు యెక్కుతూండగా నాగభూషణరావు ముఠాలోని ఒకవిద్యార్థిఅసహ్యంగా వొకమాట అన్నాడట. కామేశ్వరికి కోపం ముక్కుగోళ్ళమీద పడగలు విప్పగా కాళ్ళనున్న యిండియన్ హైవేల్స్‌తో కొడదామనుకున్నదట. కాని అట్లా చేయలేదు. ఆమెకే భయం వేసిందట.

అవి జరిగిన రెండురోజులకు మా కామేశ్వరికి ఒక ఆకాశరామన్న ఉత్తరం వచ్చింది. ఆమె ఆ ఉత్తరాన్ని నాకు చూపించింది. అందులో యిలా రాసి వుంది —

ప్రియమైన కామేశ్వరికి,

ఒకవిద్యార్థిమీద పోటీచేసి యెన్నికల్లో గెలిచానని విర్ర వీగుతున్నట్టున్నావు: నీ పొంగు ఎన్నాళ్ళు? ఇంతమంది మగపిల్లలు వున్న కాలేజీలో నువ్వు స్టూడెంట్సు యూనియన్ ప్రసిడెంటుచేయడమా? నువ్వు ఆ విశ్వంభరరావుగాడ్ని నమ్ముతున్నావు. వాడునిన్ను నడిసముద్రంలో ముంచుతాడు. జాగ్రత్త. మర్యాదగా నువ్వు ప్రసిడెంటు షిప్‌కు రాజీనామా యిచ్చి, నీ చదువు యేమిటో, నీవ్యవహారమేమిటో — నువ్వు చూసుకోవడం మంచిది — ఇటువంటి పదవులకు నీ బోటి అమ్మాయిలు పనికిరారు. ఇప్పుడు రాజీనామా యివ్వకుంటే

ముందు ముందు ఎదుర్కోవల్సిన కష్టాలు చాలా వుంటాయి. జాగ్రత్త! ఆలోచించు.

ఆకాశ రామన్న.

ఆ ఉత్తరం నాగభూషణరావు వ్రాసివుంటాడనేది స్పష్టమైంది. అయితే ఏం చేయడం? మా కామేశ్వర్ని భయం మెలివేసికుంది. నాకూ యేం కర్తవ్యం బోధపడలేదు. అది కేవలం బెదరింపేనని అనుకొనేందుకు ఆస్కారం లేదు. ఎందుచేతంటే పగబట్టిన త్రాచుపాములాంటివాడు నాగభూషణరావు ఆతని ఆజ్ఞను నిముషాలమీద శిరసావహించటానికి ఏపని చేయుమన్నా చేసి రావడానికి తగిన బలగం ఉంది.

ఆ విషయం మామయ్యతో చెపుదామని అన్నాడు గాని మా కామేశ్వరి వద్దన్నది. ఆ విశ్వంభరరావుకు కూడా చూపించింది ఆ ఉత్తరం. అతను తాపీగా ఆలోచించి భయపడాల్సిన అవసరం యేమీ లేదనిన్నీ, తనవుటావున్నారనిన్నీ చెప్పాడు. అప్పుడు కామేశ్వరికి కాస్త ధైర్యం చేకూరింది.

సెప్టెంబరు మొదటి వారంలో కాలేజీలో 'పంచవర్ష ప్రణాళిక'ల మీద ఒక మీటింగ్ జరిగింది. ఆ మీటింగ్‌కు నాగభూషణరావు ముఠావాళ్ళు వచ్చారుకానీ యేమీ గోల చేయలేదు. సభ ప్రశాంతంగా గడిచిపోయింది. నాకు అమితాశ్చర్యం వేసింది. నాగభూషణరావుకు యింత ప్రశాంతత ఎట్లా యేర్పడింది? అతనిలో పరివర్తన ఎట్లా కల్గింది.

నన్ను తలక్రిందులుగా జేసిన యింకో విషయమేమిటంటే — ఆ సాయంకాలం నాగభూషణరావు మా ఇంటికి వచ్చాడు. నేను బజారు కెళ్లేందుకు మేడమెట్లు దిగుతూంటే

క్రింద డ్రాయింగ్ రూమ్ సోఫాలో కూర్చుని ఉన్నాడు. అప్పుడే మా కామేశ్వరి టాయిలెట్ ముగించుకొని వచ్చి అతని ఎదురుగ్గా సోఫాలో కూర్చుంది. పనిమనిషి కాంతమ్మ కాఫీ చేసి వాళ్ళకు యిచ్చింది.

నాగభూషణరావు కాఫీ చప్పరిస్తూ మేడ గోడలకేసి చూస్తూ—

"మీ మేడ చాలా బాగుంది." అన్నాడు.

"మా నాన్నగారు కట్టించింది!"

"ఒహో!" వాళ్ళ సంభాషణ అట్లా సాగుతూంది. నేను మెట్లుదిగి బజారుకెళ్ళాను ఇండియన్ ర్యాలీ ఇండస్ట్రీస్ వారి వాహనం మీద.

మా కామేశ్వరి నాగభూషణరావు స్నేహాన్ని వాంఛించి యే ఉత్తరంద్వారానో యింటికి రప్పించిందని నేను సులభంగా గ్రహించాను. నాగభూషణరావుకు కూడా మంచిగావుంటే యిక కాలేజీలో తనకు ఎవ్వరూ యెదురు వుండరనే ఉద్దేశ్యంతో కామేశ్వరి అట్లాంటి స్నేహాన్ని వాంఛించి వుంటుందనికూడా నాలో వూహ బయల్దేరింది. అదేగనుక నిజమైతే మా కామేశ్వరి ప్రమాదస్థితిలో పడ్డట్లే నిర్ణయించవచ్చు. ఒకప్రక్క ఒకర్ని ప్రేమిస్తోన్నట్లు నటిస్తూ, మరొకప్రక్క యింకొకర్ని మచ్చిక చేసికొందుకు ప్రయత్నించడం దారుణం కాదూ! ఆ నేర్పు కామేశ్వరికి ఉన్నదా? అసలుకు ఎంత దుస్థితి పట్టెది!

'ఆ రోజురాత్రి నేను కామేశ్వరి గదిలోకి స్వయంగా వెళ్ళి—

'హా! నీ వ్యవహారం ఏమీ బావుండలేదు' అన్నాను సీరియస్‌గా.

"ఏం?"

"నాగభూషణరావ్ వచ్చి వెళ్ళాడు సాయంత్రం, ఎందుకు?"

"నేనే పిలిపించాను."

"నువ్వా? ఎందుకు?"

"మాట్లాడేందుకు?"

"ఏం మాట్లాడేందుకు?"

"వివరంగా చెప్పాలా?" కోపం తెచ్చుకుంది కామేశ్వరి. కామేశ్వరికి కోపం యెప్పుడూ ముక్కుమీదనే వుంటుంది.

"నీ పద్ధతేం బావుండలేదు. నువ్వు నాగభూషణరావును పిలిపించిన కారణం నాకు తెలుసు. అతను దుర్మార్గుడు. అతనితో నువ్వు మాట్లాడవల్సిన దేమిటి? అన్నాను ఆవేశపడుతూ.

"నేను సామాన్యమైన గర్ల్‌ను కాను! స్టూడెంట్సు యూనియన్ ప్రసిడెంటును. నాకు అన్ని రకాలైన విద్యార్థులతో పరిచయం కావాలి. స్టూడెంట్సు యూనియన్ విషయమై నాకు అతనితో మాట్లాడవల్సిన అగత్యం ఏర్పడింది"

ఇక నేను ఏం మాట్లాడలేక పోయాను. వక్రమార్గంలో పడబోతున్న ఆపిల్లకు సలహా యివ్వాలని నాలో కలిగిన ఆవేశం రబ్బరు బెలూన్ లోనిగాలి తీసివేసినట్టు చప్పగా జారిపోయింది. తిరిగి నా గదిలోకి ఒచ్చేశాను.

నాగభూషణరావు అప్పుడప్పుడు మా కామేశ్వరి ఇంటికి వస్తున్నట్టు, ఆమె ప్రేమోన్మాదుడైన విశ్వంబర రావుకు తెలిసింది. అతనికి విపరీతమైన కోపం వచ్చింది. కామేశ్వరి తనని మోసం చేస్తున్నట్టు అనుమానపడ సాగాడు. ఒక సాయంత్రం ఆమెను కలిసికొని—

"నువు నాగభూషణరావుతో స్నేహం చేయడం నాకు ఇష్టం లేదు." అన్నాడు కామేశ్వరిమీద ఎంతో అధికారం వున్న ధోరణిలో.

"ఏం? ఎందువల్ల?"

"అతని ప్రవర్తన మంచిదికాదు. అటువంటి వాళ్ళతో నీలాంటిఅమ్మాయి స్నేహం చేయడం ఎవరైనా చూస్తే ఎంత పరువు తక్కువ, నువ్వు గమనించడంలేదు.

నాకు తెలిసినంత వరకూ అతని ప్రవర్తనలో చెడు ఏమీ నాకు అవుపించలేదు.

"ఏమీ అవుపించలేదా? మీటింగుల్లో నువ్వు మాట్లాడుతున్నప్పుడు గాడిద అరుపులు గుర్రం సకిలింపులు చేసింది అతను కాదా? కాలేజీ గోడలమీద నీపేర్లు అసభ్యంగా వ్రాసింది అతను కాదా? నిన్ను భయపెడుతూ, పదవికి రాజీనామా యివ్వమని బెదిరిస్తూ ఆకాశ రామన్న ఉత్తరం వ్రాసింది అతనుకాదా! ఇంక పైగా అతని ప్రవర్తనలో చెడు ఏమి లేదంటున్నావా? నీపద్ధతి నాకేంబావుండలేదు. అతనితో స్నేహం మానుకో. తేనెపూసిన కత్తిలాంటివాడు."

"అతన్ని గూర్చి మీరు అనవసరంగా దూషిస్తున్నారు!"

"దూషణా? కాదు ఉన్న విషయం చెబుతున్నాను. అతనితో స్నేహం నీకు శ్రేయస్కరం కాదు."

కాని మా కామేశ్వరి విశ్వంభరరావు మాటల్ని లక్ష్య పెట్టలేదు. నాగభూషణరావుతో మాట్లాడటం మానలేదు. విశ్వంభరరావు నిరాశ చెందాడు. నిరాశతోనే అతనికి ఆమె మీద అంతులేనికోపం పిచ్చి పెరిగిపోయింది. ఆమె తనని వంచన చేస్తూ నాగభూషణరావును ప్రేమిస్తూన్నదని నిశ్చయించుకున్నాడు. తగిన ప్రాయశ్చిత్తం కామేశ్వరికి చేయాలని కూడా విశ్వంభరరావు తన ముఠావాళ్ళతో సంప్రదించాడు.

మా కామేశ్వరి పరిస్థితి మళ్ళీ ప్రమాదస్థితిలో పడింది. ఆమెను విశ్వంభరరావు అపార్థం చేసికోవడంతో ఆమె పరిస్థితి అట్లయింది.

ప్రవేశిస్తూన్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రేమాంకురార్పణకు_సాంకేతిక స్థలాలైనప్పటికి, ఆ ప్రేమ—కేవలం ఉద్రేకం, మోహం, చంచలత మొదలైన లక్షణాలతో నిండి వుండటంచేత, ఎక్కువభాగం కాలేజీ వదిలిపెట్టగానే. పరీక్ష తప్పగానే 'స్వస్తి' చెప్పబడుతూంటుంది. కాలేజీలో ఉన్న రోజుల్లో_అసూయ, అపార్థం, అశాంతి, ద్వేషంతో సతమతమవుతూంటారు ఆ జాతికి చెందిన అబ్బాయిలూ, అమ్మాయిలూ.

స్టూడెంట్సు యూనియన్ తరపు మీటింగుల్లో కామే శ్వరిని గోలచేయ నారంభించారు విశ్వంభరరావు ముఠా వాళ్ళు. ఆమెపేరు మళ్ళీ కాలేజీ గోడలమీదకు యెక్కింది. ఇదంతా చూస్తూంటే నాకూ మా కామేశ్వరిమీద తగని అసహ్యమేసింది. ఆమెను గట్టిగా చీవాట్లువేద్దామనుకున్నాను. కానీ ఆమెమీద నాకు అటువంటి అధికారం ఏ మాత్రమూ లేదు.

అర్ధసంవత్సరపు పరీక్షలు అయిపోయినాయి.

సెలవల్లో నేను మా స్వగ్రామం వెళ్ళాను. మళ్ళీ కాలేజీ తెరవడంతో వచ్చాను.

సెలక్షన్ ఎగ్జామినేషన్‌లో నాకు బాగానే మార్కులు వచ్చాయి. కాని మా కామేశ్వరికి ఏ సబ్జక్టులోనూ యిరవై మార్కులు దాటలేదంటే నమ్మండి. స్టూడెంట్సు యూనియన్ అధ్యక్షురాలికి అన్ని తక్కువ మార్కులు రావడమా? ఏమైనా మా కామేశ్వరి డిటెయిన్ కాలేదు. ఆమెతోపాటు మార్కులు వచ్చినవాళ్ళను డిటెయిన్ చేసినా మరి ఆడపిల్ల అని కానీయండి, స్టూడెంట్సు యూనియన్ అధ్యక్షురాలుఅని కానీయండి, మా మామయ్య కూతురని కానీయండి — డిటె యిన్ చేయలేదు. ఈ విషయం మా మామయ్యకు తెలిసింది. కానీ ఆయన మా కామేశ్వరిని ఏమీ నిందించలేదు. కనీసం బాగాచదువు అనికూడా హెచ్చరిక చేయలేదు. ఆయనకు ఒక్క అమ్మాయి కావడంచేత కామేశ్వరికిపూర్తిస్వాతంత్ర్యం యిచ్చాడు. ఆమెఏపని చేసినా డబ్బుయెంతఖర్చు చేసినా, ఎంత చదవకపోయినా, ఎన్నిసార్లు తప్పినా, ఎవరితో తిరిగినా

—ఏమీ అనదు. అందుచేత ఆమెవిషయంలో నాకు మా మామయ్యకు ఆమెమీద యెటువంటి నివేదికనూ సమర్పించే అవసరం లేదు.

కాని మా కామేశ్వరిలో చదువుమీద ఆసక్తి బాగా కలిగింది. 'స్టూడెంట్సు యూనియన్‌కు అధ్యక్షురాలిగా పని చేస్తూ చదువులో ఆదర్శంగా వుండాల్సిందిపోయి తనే వెనుక బడితే నలుగురూ నవ్వరూ' అని అనుకొన్నట్టుంది. ఆమె మార్కులు చూసికొని ఆమెకు ఆమే సిగ్గుపడట్టుంది. ఆ రోజు నుంచే చదువు మొదలెట్టింది, ఆరోజు రాత్రి పదిగంటల వరకూ చదివింది. కాని ఆ చదువు ఎంతవరకు తలకెక్కిందో చెప్పలేం!

ఆ రోజు మా కామేశ్వరి మల్లెపూవులాంటి తెల్లటి మైసూరు సిల్కుచీర కట్టుకొని కాలేజీకి వచ్చింది. మూడో గంట మ్రోగగానే క్లాసులోకివచ్చి ఆడపిల్లలంతా కూర్చు న్నారు. మా కామేశ్వరి బెంచీ చివర కూర్చుంటుంది. ఆ రోజు ఆమె అట్లానే కూర్చుంది కాని ఆమె కూర్చోవడం తోనే క్లాసులో యేదో ఒక వింత వాతావరణం బయలు దేరింది. దాదాపు అందరూ ఒకరి ముఖాల్ని ఒకరు చూచు కొని నవ్వుకో నారంభించారు. క్లాసులో మగపిల్లలు తలెత్తి చూసే అలవాటు ఆడపిల్లలు విరివిగా కలిగి వుండక పోవడం చేత తాత్కాలికంగా మగపిల్లల నవ్వుముఖాల వెనుక దాగి ఉన్న కారణాన్ని కనుక్కోలేక పోయారు.

లెక్చరరుగారు క్లాసులోకి రావడంతోనే ఆ వాతావర ణం సద్దుమణిగింది. కాని ఆ గంట అయిపోయినపిమ్మట,

బెల్ కొట్టాక, లెక్చరరుగారు క్లాసునుంచి వెళ్ళిపోయాక —
క్లాసంతా ఒక్కసారి గొల్లుమన్నది. ఆడపిల్లలు తమ
ముఖాల్ని ఒకరికొకరు వింతగా, పరీక్షగా చూసికున్నారు.
రామలక్ష్మి కనిపెట్టింది ఆ గోలకు కారణం. కామేశ్వరి ధరిం
చిన మల్లెపువ్వులాంటి తెల్లటి మైసూరు సిల్కుచీరెను అర
చేతి వెడల్పున యెర్రని, సిరారంగు అయింది. ఎవరో దుర్మా
ర్గులు ఆమె కూర్చునే స్థలంలో అంతకుముందు యెర్రసిరాని
చల్లారు. మగపిల్లల కొంటెతనానికి కామేశ్వరి ఒళ్ళంతా మం
డింది. కాని ఏం చేయగలదు? వెంటనే ప్రిన్సిపాల్ గారికి
రిపోర్టు చేసింది.

ఆ అవమానాగ్నితో మా కామేశ్వరి వెంటనే కారు
దగ్గరకు వచ్చింది — ఇంటికి వెళ్లేందుకు. రెండోగంట —
పాలిటిక్స్ క్లాస్. ఆ గంటమానివేసి ఇంటికి బయలు దేరింది.
డ్రైవరు కునుకు తీస్తున్నాడు. వాడ్నితట్టిలేపి ఇంటికి కారును
పోనివ్వమని — కారులో కూర్చుంది. నలుగురైదుగురు విద్యా
ర్థులు (విశ్వంభరరావు ముఠాలోనివాళ్ళు) లైబ్రరీ ప్రక్కన
ఉన్న మర్రిచెట్టుక్రింద కూర్చుని నవ్వుతున్నారు. కారు స్టారు
కాలేదు. కారణం ముందలి చక్రాల్లో గాలిలేదు ఏమైంది?
ఎవరో తీసివేశారు? ఎందుకు? కామేశ్వరికి మహా చెడ్డకోపం
ఒచ్చింది. అయినా ఏం చేస్తుంది? ఈ కొంటెపనులన్నీ విశ్వం
భరరావు ముఠావాళ్లే చేస్తున్నారని ఆమెగ్రహించింది. విశ్వం
భరరావు వెనుకఉండి చేయిస్తున్నాడనికూడా ఆమె సుల
భంగా నిర్ణయించుకుంది.

మరునాడు మా కామేశ్వరి టిస్యూ చీరెతో, జార్జెట్

సిల్కు జాకెట్టుతో కాలేజీకి వచ్చింది. ఆమె క్లాసులోకి వచ్చి కూర్చోగానే యెదురుగ్గా బోర్డుమీద ఒకబొమ్మ అగపడింది. ఆ బొమ్మ ఆమె నుద్దేశించి అసహ్యంగా, వికృతంగా చిత్రించబడింది! అది తెలుగు క్లాసు కావడంచేత ఆ బొమ్మ చెరిగిపోయేందుకు ప్రయత్నాలు జరుగుగలేదు. కామేశ్వరికి ముళ్ళమీద కూర్చున్నట్టుంది. ఆ క్లాసులో ఇటువంటి అసభ్యకరములైన చేష్టల్ని అరికట్టడము యెల్లాగో ఆమెకు యేమీా పాలుపోవటం లేదు. ఆ రోజుకూడా కామేశ్వరి కాలేజి వదిలిపెట్టక ముందే ఇంటికి వెళ్ళింది అవమానంతో

ఆ సాయంత్రం మా కామేశ్వరి నాగభూషణరావును పిలిపించి గంటన్నరసేపు మాట్లాడింది. ఏం మాట్లాడిందో నేను వినలేదు.

మరునాడు సాయంత్రం నేనూ, కాంతారావూ, చంద్రమూ కలిసి సైకిళ్ళమీద సముద్రంకేసి షికారుగా బయలుదేరాం. కాలేజీ వీధినుంచే వెడుతున్నాం. ఆరోజు ఆదివారం. కాలేజీ దాటాక నాయుడమ్మపేట సెంటరులో యిరవై మంది మనుష్యులు గుమికూడి వుండటంచూసి, విషయమేమిటో కనుక్కుందామనే తలంపుతో సైకిళ్ళు దిగాము. రెండు ముఠాలవాళ్లు బూతులు తిట్టుకుంటూ కొట్టుకొనేందుకు సంసిద్ధులుగా ఉన్నారు. ఆ రెండుముఠాల నాయకులైన విశ్వంభరరావూ, నాగభూషణరావూ వున్నారు.

ఎందుకు కొట్టుకోబోతున్నారో తెలిసికోకుండా నేను వెంటనే సైకిలెక్కాను. కాని వీధినుంచిపోయే అమ్మాయిల్ని చూడటంలోనూ, బజారులో జరిగే ప్రతిచిన్న వింత విష

యాన్ని ఆసక్తిగా చూడటంలోనూ ప్రత్యేక అనుభవాన్ని సంపాదించిన మిత్రుడు కాంతారావు, గేమ్సులోనూ, పోట్లాటల్లోనూ తరుచూ పాల్గొనే చంద్రమూ వాళ్ళు కొట్టుకోవటాన్ని చూసిగాని రాలేదు. నేను అంతవరకూ కిల్లీ బడ్డీదగ్గర నిలబడ్డాను. వాళ్ళు కొట్టుకున్న కారణమైతే వాళ్ళకు బోధపడలేదుగానీ, బాగా కొట్టుకొన్నారట. ఇద్దరకు తలలమీద బలమైనగాయాలు కూడా తగిలాయ్యట.

ఆ రాత్రి విషయం నేను కామేశ్వరికి విన్నవించాను. ఆమె నిశ్చేష్టురాలైంది. ఆ పైన నేను ఆమె ప్రవర్తనను గర్హిస్తూ తీవ్రంగా ఆమె ముఖాన్నే విమర్శించాను. నా అభిప్రాయం — విశ్వంభరరావూ, నాగభూషణరావూ కొట్టుకోవటానికి కారణం కామేశ్వరియేనని. ఆమె ఏం మాట్లాడలేదు.

ఆరాత్రి సన్నగా వానచినుకులు పడుతున్నాయి. గాలి కూడా చల్లగావుంది. ఆలోచిస్తూ వుండటంవల్ల పదకొండు గంటలైనా నాకు నిద్రపట్టలేదు. సిగరెట్టు వెలిగించి_బయట వరండాలోకివచ్చి నిలబడ్డాను. ఇంతలో ఏదో ఆకారం బయట ప్రహారీగోడదాటి లోపలకు ప్రవేశించింది. దొంగా? నాకు భయమేసింది. స్తంభంచాటుకెళ్ళి చూస్తూ నిలబడ్డాను. ఆ ఆకారం సపోటా చెట్లచాటుగా, సంపెంగచెట్టును తప్పించుకొని మెల్లగా వరండాలోకి వచ్చింది.

నాగభూషణరావు!

ఎంతసాహసం? అర్ధరాత్రి యింట్లో ప్రవేశించడమా! ఎన్ని గుండెలు! కామేశ్వరి రమ్మన్నదేమో! ఎంత అవినీతి? ఆమె అంత నీచానికి పాల్పడుతుందా? సంఘంలో నా ప్రత్యేక స్థానం హోదా, పేరూ – ఇన్ని కలిగిన కుటుంబంలో గారాబంగా పెరుగుతూన్న ఆమెకు ఈ వ్యవహారం సబబేనా? ఆమెకు విచక్షణాజ్ఞానం యెట్లా లేకపోయింది? ముందూ వెనుకలు యెందుకు ఆలోచించలేదు? తల్లిదండ్రుల పరువూ, తన వ్యక్తిత్వపు విలువనూ, సంఘంయిచ్చిన గౌరవాన్ని – ఇలా మంటగలపటమా?

నాగభూషణరావు కామేశ్వరి గదికేసి వెళుతున్నాడు. గది తలుపు తట్టాడు ఆమె గది తెరచింది. లోపలకు వెళ్ళాడు. గది తలుపుల్ని అతనే మూశాడు. నేను ఆమె గదిగోడ ప్రక్కనే నిలబడి – లోపల సంభాషణ వింటున్నాను.

"ఇంత సాహసమా? ఎవరైనా చూస్తే!

"ఏం చూస్తే?"

"కాదు. పరువూ, మర్యాదా, హోదాగల కుటుంబంలో పుట్టినదాన్ని. నన్ను నువ్వు అపార్థం చేసికొన్నావు.

"నిన్ను నేను ప్రేమిస్తున్నాను."

"కాని నిన్ను నేను ప్రేమించటంలేదని చెప్పటానికి విచారిస్తున్నాను. దయచేసి వెంటనే వెళ్ళండి.

"అంతేనా! ఇన్నాళ్ళనుంచీ అంతా నటనేనా?"

"క్షమించండి. నేను కాలేజీ జీవితాన్ని అపార్థం చేసికొన్నాను. అందువల్లనే యిన్ని అనర్థాలు.

"నువ్వంటే నాకు—"

"దూరంగావుండు. పిచ్చి పిచ్చిగా ప్రవర్తించావంటే మానాన్నని పిలిపించి నిన్ను పోలీసులకు పట్టించగలను."

తరువాత తలుపు తెరచిన చప్పుడు – నాగభూషణరావు వచ్చినదారినే బయటికి వెళ్ళాడు. నాకు అంతులేని కోపం వచ్చిందికానీ మెదలకుండా వూరుకున్నాను.

ఆ రాత్రి తెల్లవారూ మా కామేశ్వరి ఏం ఆలోచించుకుందో ఏమిటో – మరునాడు ఉదయంకాలేజీలో ప్రిన్సిపాల్ గారికి సమక్షమున స్టూడెంట్సు యూనియన్ అధ్యక్షురాలి పదవికి తన రాజీనామా పత్రాన్ని అందజేసింది.

చాలామంది ఆశ్చర్యపడ్డారు.

కాని నాకు ఆశ్చర్యం వేయలేదు.

ఆమెలో జరిగిన పరివర్తనకు పైపెచ్చు ఆనందం కలిగింది.

అప్పటినుంచీ మా కామేశ్వరి ఏ వ్యవహారంలోనూ జోక్యం కలిగించుకోకుండా పాఠ్యగ్రంథాన్నే చదివి బి. ఏ. పరీక్షకు కూర్చుంది. కాని ఒక విషయం చెప్పేందుకు విచారించవలసి వస్తోంది. ఆమె ప్యాసు కాలేదు.

ఏం, ప్యాసు కాకపోతే!

—ఆంధ్రప్రభ